లోలెవల్ వంతెనతో అవస్థలు

- చిన్నపాటి వర్షానికే ఎక్కిపారుతున్న నీరు
- గ్రామాల మధ్య స్తంభిస్తున్న రాకపోకలు
- హైలెవల్ వంతెనగా మార్చాలని డిమాండ్
- స్పందించని అధికారులు

చిన్నపాటి వర్షానికే రాకపోకలు స్తంభిస్తాయి. ఊర్ల మధ్య సంబంధాలు కొంతకాలం ఆగిపోతాయి. దీంతో వాహనదారులు, రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇది మగనూరు మండలంలోని అడవిసత్యారం–మందిపల్లి, వర్కూర్– మాగనూర్, నేరడగం–మక్తల్ రహదారుల మధ్య లోలెవల్ వంతెనలపై వర్షం నీరు ఎక్కిపారిన ప్రతి ఏటా రాకపోకలు స్తంభిస్తాయి. హైలెవల్ వంతెనలు నిర్మించాలని ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు.

– మాగనూర్



వాడ్వాట్ -అడవిసత్యారం లోలెవల్ బ్రిడ్జిపై పారుతున్న నీరు (ఫైల్)

మాగనూర్ మండలంలోని పలు గ్రామాల మధ్య నిర్మించిన లోలెవల్ వంతెనలతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. వర్షాలు కురిసినప్పుడు రాకపోకలకు ఆటంకం లేకుండా హైలెవల్ వంతెన నిర్మించాల్సిన అధికారులు గతంలో లోలెవల్ వంతెనలు నిర్మించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మండలంలోని అడవిసత్యారం– మందిపల్లి, వర్కూర్–మాగనూర్, నేరడగం–మక్తల్ గ్రామాల మధ్య రోడ్లపై లోలెవల్ వంతెనలు నిర్మించారు. కానీ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఎత్తు పల్లాలను పట్టించుకోకుండా వంతెన నిర్మాణం చేపట్టడంతో చిన్న పాటి వర్షానికే బ్రిడ్జిలపై నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో వరదలు వచ్చినప్పుడల్లా ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయి. రోడ్డు వెడల్పు లేకపోవడం, వాహనాలు తిరిగి వెళ్లడానికి వీలు కాకపోవడంతో వరద ఉధృతి తగ్గే వరకు అక్కడే ఉండాల్సిన పరిస్థితులు నెలకొంటోంది.

కార్మికులకు, ప్రజలకు తప్పని తిప్పలు..

వాడ్వట్–అడవిసత్యారం గ్రామాల మధ్య సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీరుతో పాటు, చిన్న పాటి వర్షానికే వరదనీరు బ్రిడ్జిపై నుంచి వెళ్తోంది. వాడ్వట్, అడవిసత్యారం గ్రామాల మధ్య విద్యార్థులు, కార్మికులు, ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే నానా ఇబ్బందులు పడుతున్నారు. వరద వచ్చిన కొద్ది రోజులు ఇంటికే పరిమితం కావాల్సి వస్తోంది. ఆయా గ్రామాల నుంచి ఉపాధి పనులకు వెళ్లే కూలీలు సైతం విధులకు హాజరు కాలేకపోతున్నారు. గతేడాది మాదిరిగా భారీ వర్షాలు కురిసి ఆయా వాగులకు వరదలు వస్తే గతేడాది పరిస్థితి పునరావృతమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లోలెవల్, ఇరుకు వంతెనలను తొలగించి ఎగువ వంతెన (హైలెవల్ వంతెన) నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు..



లోలెవల్ వంతెనలతో వరదలు వచ్చినప్పు డు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వంతెనలు పునర్నిర్మించాలని పలుమార్లు విన్న వించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– బసంత్‌రెడ్డి, వడ్వాట్

త్వరలోనే నిర్మిస్తాం..



లోలెవల్ వంతెనలతో చాలా గ్రామాలు జలదిగ్బంధం అవుతున్నాయనేది వాస్తవం. అయితే ప్రస్తుతం హైలెవల్ వంతెన నిర్మాణానికి సరిపడ నిధులు లేవు. ప్రభుత్వానికి ప్రపోజల్ పంపిస్తున్నాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

– మారుతి, పంచాయితీ రాజ్ ఇన్‌చార్జి ఏఈ

క్లుప్తంగా

పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలి

కొత్తపల్లి: తెలంగాణ ప్రజా వీరుడైన పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కొత్తపల్లి మండల ముదిరాజ్ సంఘం నాయకులు కావలి సాయిలు ఒక ప్రకటనలో కోరారు. ఆగస్టు 8వ తేదీన ప్రతి మండల ప్రభుత్వ కార్యాలయలలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించేలా ప్రత్యేక జీఓను విడుదల చేయాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి బీసీలకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిడ్జింత మాజీ సర్పంచ్ జగ్గప్ప, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు జనార్దన్, శివ శంకర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం



నర్వ: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని నాయకులు లంకాల్ కుర్వ మహేష్ అన్నారు. పాథర్చేడ్ గ్రామంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బోలుబండ వెంకటేష్, నెట్టంపాడు వెంకటేష్, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, మన్యం, బోలుబండ శివ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

దామరగిద్ద: అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్ ను స్థానిక పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజు వివరాల ప్రకారం.. మండలంలోని మద్దెల్‌బీడ్ గ్రామ శివారులో శాసన్ పల్లి గ్రామానికి చెందిన భగవంతుకు చెందిన టిప్పర్‌లో ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో అనుమతి లేకుండా టిప్పర్‌లో ఇసుకను తరలిస్తున్న డ్రైవర్ నరేష్‌ను పోలీసులు విచారించగా, మక్తల్ నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక టిప్పర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా అయ్యలప్ప స్వామి పల్లకీసేవ



ఊట్కూరు: ఊట్కూరులో కుర్వ కులస్తుల ఆరాధ్య దైవమైన అయ్యలప్పస్వామి పల్లకీ సేవను ఆదివారం భక్తులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యలప్పస్వామి దేవాలయం నుంచి పల్లకీ సేవను చేపట్టి గ్రామ పురవీధుల్లో శోభయాత్ర చేపట్టారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు గోవిందప్ప, పాలప్ప, ఆశప్ప, భీంశప్ప, రామప్ప పాల్గొన్నారు.

మగ్దుంపూర్‌లో వైద్యశిబిరం



ఊట్కూరు: మండలంలోని ముగ్దుంపూర్‌లో ఆదివారం ఐశ్వర్య క్లీనిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరం విజయవంతమైంది. ఈ సందర్భంగా డాక్టర్ భరత్‌కుమార్ సుమారు 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకటరాములు, నారాయణ, నర్సింహ, దస్తప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యమే పేదలకు అండా



మక్తల్: ఇందిరమ్మ రాజ్యంలో నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేసి అండగా ఉంటుందని మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. ఆదివారం ఇందిరమ్మ లబ్ధిదారుల నిర్మాణ పనులను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్‌లో 300 ఇళ్ల రూ.15 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారికి బేస్‌మెంట్ బిల్లు లక్ష రూపాయలు రావడంతో అకౌంట్లో జమ కాగా, ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, చంద్రశేఖర్‌గౌడ్, కట్ట వెంకటేష్, విశ్వనాథ్, అబ్దుల్ రహిమాన్, భాస్కర్, హన్మంతు, బోయ వెంకటేష్, రమేష్, దండురాము, ఆనంద్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



శాతవాహన కాలనీలో కేక్ కట్ చేస్తున్న క్రీడాకారులు



షేర్నపల్లి లో ఫ్రెండ్ షిప్ బ్యాండ్ కట్టుకుంటున్న యువతులు

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలో ఆదివారం స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిత్రులందరూ ఒకచోట చేరుకుని సంబరాలు చేశారు. మిఠాయిలు తినిపించుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మిత్ర మండలి ద్వారా ప్రజలకు ఉపయోగపడే రక్తదానం, ఇతర సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, సభ్యులు మల్లేష్, వెంకట్ రాములు, వెంకటయ్య, గుత్తి రమేష్, సైదప్ప, ప్రశాంత్, గోపాల కృష్ణ, రాము, బాలకిషన్ పాల్గొన్నారు.

- మండలంలోని కోటకొండ, షేర్నపల్లి, కొల్లంపల్లి, భైరంకొండ తదితర గ్రామాల్లో ఫ్రెండ్ షిప్ డే నిర్వహించారు. మిత్రులంతా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఫ్రెండ్ షిప్ బ్యాండ్ కట్టుకున్నారు.

మరికల్: మండల కేంద్రంలో ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. మరికల్‌లో చిన్నారులు, యువకులు ఒకరినొకరు చేతులకు స్టికర్స్ వేసుకోని స్నేహం విలువ చాటారు. కార్యక్రమంలో రమేష్, వేణు, చెన్నయ్య, ఆంజనేయులు, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని రైతుల రాస్తారోకో



మక్తల్ అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

మక్తల్: మక్తల్–నారాయణపేట–కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూములు కోల్పోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని మక్తల్ మండలం కాట్రేవ్‌పల్లి, యర్నాగాన్‌పల్లి, కాచ్‌వార్, గ్రామాల రైతులు ఆదివారం మక్తల్ అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. భూ నిర్వాసితుల జిల్లా నాయకులు ఆంజనేయులు, గోవిందురాజ్‌లు మాట్లాడుతూ భూములు కోల్పోతున్న రైతులకు రూ.14 లక్షలు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మార్కెట్ ధరలు రూ.50 లక్షల నుంచి కోటి వరకు ఒక ఎకరాకు కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, గోవిందురాజు, నర్సింహులు, కృష్ణ, అంజప్ప, హన్మంతు, నారాయణగౌడ్, సత్యనారాయణ, సోమన్న, రాజు, వెంకట్‌రెడ్డి, కేశవులు, రవీందర్‌రెడ్డి, రాజు, రవికుమార్, నర్సప్ప, శ్రీశైలం, వెంకటప్ప పాల్గొన్నారు.

రైతుల పక్షాన న్యాయపోరాటం చేస్తాం

నారాయణపేట రూరల్: జీఓ 69 పనుల్లో భాగంగా నిర్మిస్తున్న నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, లేకపోతే న్యాయ పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర నాయకులు నాగురావునామాజీ స్పష్టం చేశారు. పేరపళ్ల గ్రామానికి చెందిన 69 జీఓ ఎత్తిపోతల పథకం భూసేకరణ నష్ట పరిహారం బాధితులు కలిశారు. బీజేపీ లీగల్ సెల్ నాయకులు నందు నామాజి, బీ కే ఎస్ నాయకుడు మల్లప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు అండగా నిలుస్తాం

నారాయణపేట/ఊట్కూర్: నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద భూ నిర్వాసితులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేసేందుకు అండగా ఉంటామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.భాస్కర్ తెలిపారు. ఊట్కూర్ చెక్‌పోస్టు దగ్గర రాస్తారోకో చేపట్టారు. బీజేపీ, బీఆర్‌ఎస్‌లు మద్దతు ప్రకటించారు. ఊట్కూర్ చెరువు కింద ఊ ట్కూర్, దంతన్‌పల్లి, మొగ్దంపూర్ గ్రామాలకు ఎన్ని ఎకరాలకు సాగు నీరు ఇస్తారనేది డీపీఆర్ ఎక్కడుందో మినిస్టర్ చెప్పాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాజీ ఎంపీటీసీలు దొబ్బలి హన్మంతు, కిరణ్, మాజీ వార్డు సభ్యులు రఘువీర్, నాయకులు కుర్వ ఆశప్ప, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దామరగిద్ద: పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగంగా రైతుల సమ్మతి లేకుండా బలవంతపు భూ సేకరణ ఆపాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, అంజిలయ్యగౌడ్, మొగులప్ప అన్నారు. అంబేడ్కర్ చౌరస్తాలో భూ నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. కేవలం 14 లక్షల ధర నిర్ణయించి బలవంతపు భూ సేకరణ చేయడాన్ని ఆపాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జోషి, మొగుల ప్ప, శ్రీనివాస్ రెడ్డి, నర్సిరెడ్డి, చంద్రశేఖర్, అశోక్, నారాయణ, బాల్రాజ్, రాజు రైతులు పాల్గొన్నారు.



దామరగిద్దలో రాస్తారోకో చేస్తున్న రైతులు

రాష్ట్ర స్థాయి యోగాపోటీలకు విద్యార్థులు



మరికల్: రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు మరికల్ విద్యార్థులు ఎంపిక కావడంతో ఆదివారం డీఈఓ గోవిందరాజులు వారిని అభినందించారు. మండల కేంద్రంలోని రిషి హైస్కూల్ పాఠశాలకు చెందిన గణేష్, విగ్నేష్, చరణ్‌తేజ జిల్లా స్థాయిలో జరిగిన యోగా పోటీలో విజేతలుగా నిలిచి, వారు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. వారిని డీఈఓతో పాటు డీఎంహెచ్ఓ బాలాజీ, పతాంజలి అధ్యక్షుడు సురేష్‌కుమార్ కరస్పాడెంట్ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో అశోక్, సాయికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ, రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారికి సన్మానం



మక్తల్: హైదరాబాద్‌లో బండ్ల గూడల్లో నిర్వహించిన ఖేల్ ఇండియా ఉమెన్స్‌రోడ్డు స్పీడ్ సైక్లింగ్ పోటీల్లో 5, 10, 20 కి.మీ.లలో జాతీయ, రాష్ట్ర స్థాయిలకు ఎంపికైన వారిని ఘనంగా సన్మానించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం ఆధ్వర్యంలో శ్రీసత్యసాయి మందిరంలో మక్తల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు బాలికలను, మహిళలను శాలువాతో సన్మానించి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. క్రీడారంగంలో విద్యార్థులను ముందుకు తీసుకెళ్లి మక్తల్‌కు మంచి పేరు తీసుకరావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో పీఈటీలు అంబ్రేస్, రమేష్, త్రివేణి, స్వరూప, సౌమ్య, వెన్నల, గాయత్రి, అనూష, మల్లేశ్వరి, అంకిత, సంగీత పాల్గొన్నారు.

సువర్ణ కంకణ అవార్డుల అందజేత



మక్తల్: మక్తల్ పట్టణంలో శ్రీమల్లికార్జున స్వామి పూజారి తిప్పయ్యస్వామి దంపతులకు ఆదివారం హైదరాబాద్‌లో లలితకళా సమాఖ్య ఆధ్వర్యంలో 31వ సువర్ణ కంకణ అవార్డుల సంబరాల్లో భాగంగా వారికి అవార్డులతో పాటు శాలువాతో సత్కరించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ అవార్డులను స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అందజేశారు. సేవా సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వారిని గుర్తించి ఎంపిక చేశారు. పూజారి తిప్పయ్యస్వామి దంతులకు అవార్డులు రావడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

'చెడు వ్యసనాలకు బానిస కారాదు'



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న సీఐ శివశంకర్

నారాయణపేట రూరల్: యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసకావద్దని సీఐ శివశంకర్ అన్నారు. పీవై ఎల్ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖ కృషి చేస్తోందని, చిన్న వయసులో మద్యానికి దూరంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులను ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల్లో అవగాహన పెరిగే విధంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని, కఠిన చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ గాయత్రి, పీవైఎల్ నాయకులు ప్రతాప్, సిద్ధు, సలీం, అంజి, మల్లేష్, రాము, మధు, గణేష్, తిరుమలేష్, కృష్ణ, బాలరాజ్, శివ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల సాధనే ధ్యేయం

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ సమస్యల సాధన ధ్యేయంగా యూఎస్పీసీ పని చేస్తోందని నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మార్సీ ముందు 5న నిర్వహించే ధర్నా వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీఓ తో స్థానికత కోల్పోయిన టీచర్లకు సొంత జిల్లాకు పంపాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల టైం టేబుల్‌ను మార్చాలని, కేజీబీవీ, యుఆర్‌ఎస్, ఎస్ఎస్ ఏ ఉద్యోగులకు బేసిక్ పేను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బాలాజీ, సూర్యచంద్ర, శివరాములు, హైమావతి, వెంకటప్ప, గోవిందు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



మాట్లాడుతున్న కార్తికారెడ్డి

ధన్వాడ: 42శాతం బీసీలకు రిజర్వేషన్ అని చెబుతూ ఇందులో 10శాతం ముస్లింలను కలిపి బీసీలకు 10శాతం రిజర్వేషన్ నష్టం కల్గించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ బండ కార్తికారెడ్డి అన్నారు. ఆదివారం ధన్వాడ మండల కేంద్రంలో నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, బీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కిసాన్‌మోర్చ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు ఉమేష్, మల్లప్ప, మాధవి, ఉదయబాను, రాంచంద్రయ్య, సు రేందర్, అరుణశ్రీ, శ్రీను, కురుమూర్తి, సుదర్శన్‌గౌడ్, రవి, నవిన్ పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మద్దూరు: ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చే యజ్ఞంలో మోదీ ఉన్నారని, ఆయన దేశ ప్రజలందరు మద్దతు పలుకాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర క్రమ శిక్షణ సంఘం సభ్యులు నాగురావ్ నామాజీ సూచించారు. ఆదివారం మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్లలో బూత్ నంబర్ 79లో 'పల్లెకు పోదాం–ఇంటింటికి వెళ్దాం' కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మదన్, శంకర్, వెంకటయ్య, భవాని, రాములు, వెంకటపప, శ్రీనివాస్, లక్ష్మి, కన్కప్ప, పాల్గొన్నారు.

మరికల్: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిపై పెద్దచింత కుంటలో ఆదివారం ఇంటింటికి వెళ్లి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు వేణు, ప్రధాన కార్యదర్శి రమేష్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

122 జీఓ రద్దుతో నష్టపోతున్న రైతులు



మాట్లాడుతున్న మాజీ ఎంపీటీసీ మౌలాలి

మాగనూర్: సంగంబండ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణంతో సర్వం కోల్పోయిన నేరడగం గ్రామస్తులు తాజా మాజీ సర్పంచ్ నిర్వాహకం వల్ల తీవ్రంగా నష్టం జరిగిందని మాజీ ఎంపీటీసీ మౌలాలి విమర్శించారు. ఆదివారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. నేరడగం మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్ రాజకీయ, ఆర్థిక లాభాల కోసం గ్రామాన్ని సర్వ నాశనం చేశారన్నారు. మూడుసార్లు జీఓ పేరుతో ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొన్ని మోసం చేశారన్నారు. 2010లో జీఓ నంబర్ 122ను అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. గ్రామంలో 746 (ఎస్‌బీబీఆర్) ఇళ్లు ఉండగా, అందులో 200 ఇళ్లు ఈ గ్రామానికి సంబంధం లేని వారికి అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో 100 ఫిట్ల స్థలం కొనుగోలు చేసి అక్రమ షెడ్లు నిర్మించుకున్నారని విమర్శించారు. డబ్బుల కోసం రికార్డులో 1000 ఫిట్లకు పైగా షెడ్లు నిర్మించినట్లు చూపించారన్నారు. దీని వల్ల అర్హులైన వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. అప్పటి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డితో కలిసి గ్రామానికి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వల్ల ఎటువంటి ముప్పులేదని పరిశీలనకు వచ్చిన అధికారులకు అశోక్‌గౌడ్ సొంతంగా లేఖ రాశారని, రిజర్వాయర్ కట్టకు కొంత మేర లీకేజీలున్నాయని, వాటిని మరమ్మతుల కోసం కేవలం రూ.70 లక్షలు ఇస్తే సరిపోతుందని అధికారులకు నివేదిక ఇచ్చినట్లు తమకు ఆధారాలు లభించాయన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలువగా గ్రామానికి రిజర్వాయర్ ద్వారా ఎటువంటి ఇబ్బంది లేదని స్వయనా గ్రామ సర్పంచ్ లేఖ రాసిఇచ్చినట్లు మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురికావడం జరిగిందన్నారు. 24/11/2022 జీఓ రద్దు కావడం జరిగిందని, అయినా నాయకులు గ్రామస్తులకు చెప్పలేదన్నారు. ఇప్పటికే గ్రామంలో ఊట నీటితో అనే ఇళ్లు కూలిపోయిన సంఘటనలున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామంలో రీ సర్వే నిర్వహించి నిజమైన గ్రామస్తులను గుర్తించి, అర్హులైన వారికి పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ చూపి గ్రామానికి ఎట్టి పరిస్థితుల్లో జీఓ తీసుకొచ్చి పునరావాసం కల్పిస్తానని చెప్పడం సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో గ్రామస్తులు ఉప్పరి వెంకటేష్, వాని రాజశేఖర్, మనిగిరి మల్లేష్, పింజరి సలీమ్, అజ్జుమియా, మేస్త్రీ తాయప్ప, సిద్ధలింగ, ల్యాఖాత్ పాల్గొన్నారు.

ఈ దారిపై ప్రయాణం నరకయాతన



బురదమయంగా మారిన గజ్జరందొడ్డి రోడ్డు

మాగనూర్: మండలంలోని మందిపల్లి గేట్ నుంచి గజ్జరందొడ్డి గ్రామం చిట్యాల వెళ్లే మట్టిరోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై కొన్ని సంవత్సరాలుగా బురద, గుంతలు ఏర్పడినా ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డుకు మరమ్మతు చేయకపోవడంతో చిన్న గుంతలు సైతం పెద్దవిగా మారాయి. గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రజలు ప్రయాణం చేయలంటేనే జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి నూతన బీటీ రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన గాయత్రి మహాయజ్ఞం



గాయత్రి మహాయజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

జడ్చర్ల టౌన్: ఆర్యసమాజ మందిరంలో నిర్వహిస్తున్న శ్రావణమాస త్రిదివసీయ గాయత్రి మహాయజ్ఞం ఆదివారం పూర్ణాహుతితో ముగిసింది. కార్యక్రమానికి వివిధ జిల్లాల ఆర్యసమాజ అధ్యక్షులు, ఆర్యబంధువులు పాల్గొన్నారు. యజ్ఞంలో పాల్గొన్న ముఖ్య అతిథులు వేద విద్వాంసులు శ్రీవేద మిత్ర మాట్లాడుతూ యజ్ఞయాగాలు చేయడంతో ప్రకృతి కాలుష్యం నివారించబడుతుందని, వ్యాధులు రాకుండా యజ్ఞంలో వేసే ఔషధాల వల్ల మంచి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్యసమాజ పెద్దలు బాద్మిశివకుమార్, నర్సింహులు, బక్కరాజు, విజయ్‌కుమార్, కృష్ణయ్య, లవకుమార్, అశోక్, విజయలక్ష్మి, నందిని, స్రవంతి పాల్గొన్నారు.

తైక్వాండో శిక్షణతో ఆత్మవిశ్వాసం

మహబూబ్‌నగర్ క్రీడలు: తైక్వాండో శిక్షణతో శారీరక దారుఢ్యంతోపాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఆదివారం విద్యార్థులకు తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌బాబు మాట్లాడుతూ.. తైక్వాండో క్రీడలో జిల్లా విద్యార్థులు ప్రతిభ చాటాలని కోరారు. ఈ గ్రేడింగ్ పరీక్షలో సుజన్‌కుమార్, రాజేందర్, అరవింద్, అబ్దుల్ ఖాదర్, అశ్విన్ ఎల్లో బెల్టులు, అమలశ్రీ ఎల్లో వన్‌బెల్టు, శ్రీలేఖ, శ్రీనిధి, చందు గ్రీన్ బెల్టులు, రోషిణి, ఆది శంకర్ గ్రీన్ వన్, అఖిల్ బ్లూ, ఎండి.రేహన్‌బాబా, ధర్మ తేజ్ రెడ్ బెల్టులు, హరిచరణ్‌రెడ్డి రెడ్ వన్‌బెల్టులు సాధించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సాయిలు, కోశాధికారి శంకర్, సీనియర్ కోచ్ రాజు ఉన్నారు.